వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 325
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
అక్టోబర్ 10, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net







## అంతా డ్రామా..

- 420 హామీల్లాగే 42 శాతం రిజర్వేషన్లు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




## ఘనంగా నిట్ స్నాతకోత్సవం

ముఖ్య అతిథిగా హాజరైన
ఐఐఎం గౌరవ సభ్యుడు డాక్టర్ సనక్ మిశ్రా





## పీఎంఏవై పై
## అవగాహన కల్పించాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



# మళ్లీ మొదటికి..



## స్థానిక ఎన్నికలపై ఆశలు ఆవిరి

- హైకోర్టు స్టేతో నిలిచిన ప్రక్రియ
- ఆశావాహుల్లో నిరుత్సాహం
- గ్రామాల్లో 20 నెలలుగా ప్రత్యేక పాలన
- కుంటుబడిన అభివృద్ధి
- పాలకులపై భగ్గుమంటున్న గ్రామీణులు

ఎన్నాళ్లుగానో ఊరిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు మళ్లీ మొదటికి వచ్చాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు హైకోర్టు స్టే విధించడంతో ఆశావాహుల ఆశలు ఆవిరయ్యాయి. తదుపరి విచారణను ఆరు వారాలు వాయిదా వేయడంతో అప్పటి వరకు ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు వ్యవహరిస్తామంటూ ఎన్నికల సంఘం ప్రకటించడంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే సూచనలేవీ కనిపిస్తలేవన్న ప్రచారం సాగుతోంది. గత 20 నెలలుగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామాల్లో 2 ఫిబ్రవరి 2024 నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కాగా గతేడాది జూలై మొదటి వారంలో జిల్లా, మండల పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం ముగిసింది.

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులు విడుదల కాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. పారిశుధ్య పనులు నిర్వహించేందుకు కూడా నిధులు లేకపోవడంతో అప్పులతో కాలం వెళ్లదీస్తున్నారు. నిధుల లేమితో కనీసం తాగునీరు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం గత నెల 29న విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం తొలి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ న్యాయస్థానం ఉత్తర్వులతో ఎన్నికలకు బ్రేక్ పడింది. అయితే గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగకపోతే వాటి పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశం ఉంది. రిజర్వేషన్లను అడ్డుపెట్టుకొని ఎన్నికలను వాయిదా వేయడంపై గ్రామీణులు భగ్గుమంటున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

## ఘనంగా కేశవమూర్తి జన్మదిన వేడుకలు

- అభినందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రెస్ క్లబ్ బాధ్యులు, ఇతర జర్నలిస్టులు, సన్నిహితులు








# ఘనంగా నిట్ స్నాతకోత్సవం

- **ముఖ్య అతిథిగా హాజరైన ఐఐఎం గౌరవ సభ్యుడు డాక్టర్ సనక్ మిశ్రా**



**వరంగల్ వాయిస్, నిట్ :** జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్), వరంగల్ 67వ స్థాపన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం 1959లో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశంలోనే తొలి ప్రాంతీయ ఇంజినీరింగ్ కాలేజీ (ఆర్ఈసీ)కి శంకుస్థాపన చేయగా అది జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ నిట్ గా అభివృద్ధి చెందింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా భారత లోహ పరిశోధన సంస్థ (ఐఐఎం) గౌరవ సభ్యుడు, స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ బోర్డు సభ్యుడు, రౌర్కెలా స్టీల్ ప్లాంట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సనక్ మిశ్రా హాజరయ్యారు. అలాగే, ఆయన భారత జాతీయ ఇంజినీరింగ్ అకాడమీ, భారత లోహ సంస్థ మాజీ అధ్యక్షుడిగానూ సేవలందించారు. డాక్టర్ మిశ్రా 'ది హైపోతిసిస్ ఆఫ్ ది హైయరార్కీ ఆఫ్ నాలెడ్జ్' అనే అంశంపై ఫౌండేషన్ డే ఉపన్యాసం ఇచ్చారు. ఆయన భారత ఉపఖండంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా కూడా జ్ఞానం ఎలా పరిణామం చెందిందో వివరించి, జ్ఞానాన్ని లోతుగా అర్థం చేసుకోవడం ద్వారానే నిజమైన విజ్ఞానం, మేధస్సు సాధ్యమవుతుందని నొక్కి చెప్పారు. స్వాగత ప్రసంగంలో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లడుతూ సంస్థ అసాధారణ ప్రయాణాన్ని వివరించారు. మూడు అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు భారతదేశంలో అగ్రగామి సాంకేతిక విశ్వవిద్యాలయాలలో ఒకటిగా ఎదిగిందని తెలిపారు. ప్రస్తుతం నిట్ లో 11 బీటెక్, 26 ఎంటెక్, ఐదు ఎంఎస్‌సి., ఎంసీఎ., ఎంబీఎ., బీఎస్‌సి, బీఎడ్ మరియు సమగ్ర ఎంఎస్‌సి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. తాజాగా పునర్వ్యమర్శించిన పాఠ్యక్రమం స్వయంఅభ్యాసం, ఆవిష్కరణ, పరిశ్రమ అవసరాలకు తగిన నైపుణ్యాలపై దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు. సంస్థ విజయాలను వివరించిన ఆయన నిట్ వరంగల్ లో 8,000 మంది విద్యార్థులు, 700 మంది అధ్యాపకులు, సిబ్బంది, అలాగే 42,600 మందికి పైగా పూర్వ విద్యార్థుల బలమైన నెట్‌వర్క్ ఉందని తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో అధ్యాపకులు 884 జర్నల్ పేపర్లు, 350 కాన్ఫరెన్స్ పేపర్లు, 127 పుస్తక అధ్యాయాలు ప్రచురించి, 95 జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు, అలాగే 25 పేటెంట్లు సాధించారు. సంస్థకు మొత్తం రూ.45.65 కోట్లు విలువైన పరిశోధనా నిధులు లభించాయి. వీటిలో GIAN, SPARC, MSME, MeitY వంటి జాతీయ పథకాల కింద ప్రాజెక్టులు ఉన్నాయి. ముఖ్య ఆవిష్కరణగా 'ఎలక్ట్రికల్ కన్డక్టివ్ అప్లికేషన్స్ కోసం సిల్వర్ నానోవైర్ల నిరంతర ఉత్పత్తి' అనే సాంకేతికతను IIT రోపర్‌తో కలిసి పరిశ్రమకు బదిలీ చేయడం జరిగింది.

**81శాతం ప్లేస్ మెంట్..**

ప్లేస్‌మెంట్ విషయంలో, నిట్ వారంగల్ 81.3 శాతం ప్లేస్‌మెంట్ రేటు సాధించింది. అత్యధిక వార్షిక ప్యాకేజీ రూ.64 లక్షలుగా నమోదైంది. ఆరు బీటెక్ కార్యక్రమాలు జూన్ 2028 వరకు ఎన్ బీఏ టియర్–I గుర్తింపు పొందాయి. సంస్థ కొత్త భాగస్వామ్యాలు ZF ఇండియా, Neuralix.ai, AIT థాయిలాండ్, యూనివర్సిటీ ఆఫ్ సస్కాచెవాన్ (కెనడా), CSIR–CRRI వంటి సంస్థలతో కుదుర్చుకుంది. కొత్తగా సెంటర్ ఫర్ మెటీరియల్స్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (CMM), సెంటర్ ఫర్ ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ (CTR) అనే రెండు పరిశోధనా కేంద్రాలను ప్రారంభించింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా, 304 సామర్థ్యం గల లేడీస్ హాస్టల్, 2,500 సీట్ల అంఫైథియేటర్, 500 సీట్ల కాంటీన్ వంటి సౌకర్యాలు నిర్మాణంలో ఉన్నాయి. అదనంగా, పాత హాస్టల్ భవనాలు పునరుద్ధరించబడుతున్నాయి. సుస్థిరత చర్యలలో, UV/UF ఆధారిత తాగునీటి వ్యవస్థలు, గ్రీన్ క్యాంపస్ కార్యక్రమాల విస్తరణ ఉందని పేర్కొన్నారు. 1995, 1997 బి.టెక్ బ్యాచ్‌లు కలిపి రూ.1.15 కోట్లు విరాళమిచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే విద్యార్థులకు మద్దతు అందించాయి. అదనంగా, ఢిల్లీ అలుమ్ని చాప్టర్ మరియు శ్రీ వేణు నుగురి (1988, ఎలక్ట్రికల్) గారు ఈ–రిక్షాలు, ఎలక్ట్రిక్ వాహనాలు మరియు రూ.90 లక్షల విలువైన పరికరాలు స్మార్ట్ ఎలక్ట్రిక్ గ్రిడ్ ల్యాబ్‌కి విరాళంగా అందించారు. ఇవి పూర్వ విద్యార్థుల సంస్థ పట్ల ఉన్న అనుబంధం, సృజనాత్మకత, సుస్థిరత మరియు విద్యార్థి సంక్షేమంపై నిబద్ధతను ప్రదర్శిస్తున్నారన్నారు. డిస్టింగ్విష్డ్ అలుమ్ని అవార్డ్స్ 2025 కార్యక్రమంలో ప్రముఖ పూర్వ విద్యార్థులకు అకాడెమియా & రీసెర్చ్, ఇండస్ట్రీ & కార్పొరేట్ అడ్మినిస్ట్రేషన్, ఆంత్రప్రెన్యూర్షిప్ & పబ్లిక్ లైఫ్ రంగాలలో చేసిన విశిష్ట కృషికి పురస్కారాలు ప్రదానం చేయబడ్డాయి. వీరిలో డాక్టర్ ఆర్. విజయ్ (డైరెక్టర్, DST–AR–CI,హైదరాబాద్), ప్రొఫెసర్ మాధవి లత గాలి (IISc, బెంగళూరు), డాక్టర్ నవీన్ మంజూరన్ (ఛైర్మన్, Solve Group, USA), శ్రీమతి సునీత నదంపల్లి (అమెజాన్ వెబ్ సర్వీసెస్), శ్రీ కృష్ణ ప్రసాద్ K. S. (Aster Marine Cargo LLC, దుబాయ్), శ్రీ విపిన్ జైన్ (AMD, USA), డాక్టర్ దీపక్ రెడ్డి పుల్లగురం (అసిస్టెంట్ ప్రొఫెసర్, IIT ఖరగ్‌పూర్) ఉన్నారు. కార్యక్రమం చివరగా వోటు ఆఫ్ థ్యాంక్స్ మరియు జాతీయ గీతంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, మరియు వారంగల్, హైదరాబాద్ అలుమ్ని చాప్టర్లు సభ్యులు పాల్గొన్నారు.



## జిల్లాలో 266 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- **కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లతో సమీక్ష**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని, కొనుగోలు కేంద్రాల్లో సరియైన తూకం, తేమ శాతం, రవాణా, నిల్వ వంటి అంశాలలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న ఖరీఫ్ 2025–26 సీజన్ లో ధాన్యం సేకరణపై మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లతో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లర్లు ధాన్యాన్ని సమయానికి దిగుమతి చేసుకోవలనని సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్ లో దాదాపు వరి ధాన్యం రెండు లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా వేయగా అందుకు గాను 266 ధాన్యం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేయడమైనది ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సంబధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోనెలా రవీందర్, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ మరియు తదితర రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

**ఎనుమాముల మార్కెట్ సందర్శన..**

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. యార్డ్ లో మొక్కజొన్న, పప్పుధాన్యాలు, పత్తి రైతులతో సంభాషించారు. మొక్కజొన్న నాణ్యతను, పత్తి రైతుల లాట్ ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సీసీఐ కార్యకలాపాలు, ఎంఎస్ పీ వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, గ్రేడ్–2 సెక్రటరీ, యార్డ్ సిబ్బంది, చాంబర్ ఆఫ్ కామర్స్, పరిశ్రమ సభ్యులు పాల్గొన్నారు.

**లేఆవుట్ కమిటీ సమావేశం ..**

వరంగల్ జిల్లాలో లేఅవుట్ అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన లేఆవుట్ కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా జీబ్ల్యూఎంసీ పరిధిలో ఒక లే అవుట్, వర్ధన్నపేట మునిసిపల్ పరిధిలో రెండు అనుమతుల కోసం ప్రతిపాదనలను కమిటీ నిబంధనల ననుసరించి పరిశీలించి, సమావేశంలో చర్చించి అనుమతి మంజూరు చేసింది. ఈ సమావేశంలో జీబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డీటీసీపీ జ్యోతి, కుడా పీఓ అజిత్ రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఇజ్జగిరి, జిల్లా రోడ్ల భవనాల అధికారి రాజేందర్, జిల్లా ఇరిగేషన్ అధికారి కిరణ్ కుమార్, నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్లు సమ్మయ్య, భాస్కర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెం. 9 ప్రతుల దహనం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9 ద్వారా బీసీలకు న్యాయం జరగదని, 42 శాతం రిజర్వేషన్ అమలు కాదని రాష్ట్రంలోని బీసీ మేధావులు, సంఘాలు మొదటి నుంచీ హెచ్చరిస్తున్న నేపథ్యంలో... హైకోర్టు గురువారం ఈ జీవోపై స్టే విధించింది. దీంతో స్థానిక ఎన్నికల ప్రక్రియ ఆగిపోయింది. దీనిని నిరసిస్తూ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఇచ్చిన తెలంగాణ బంద్ పిలుపులో భాగంగా, శుక్రవారం హనుమకొండలోని కాళోజి జంక్షన్ వద్ద బీసీ సంఘాలు, వివిధ కుల సంఘాలు, మేధావులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో జీవో నెంబర్ 9 ప్రతులను దహనం చేశారు.

ఈ సందర్భంగా టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజని కుమార్ యాదవ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే ఇవ్వడంతో బీసీలకు శాశ్వతంగా 42 శాతం రిజర్వేషన్ కూడా సమాధి కాబోతోందనే ఆందోళన వ్యక్తం చేశారు. బలహీనమైన జీవో నెంబర్ 9ను ప్రవేశపెట్టి బీసీలను మోసం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేధావులతో చర్చించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించే క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ఉద్యమానికి రూపకల్పన చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని రజని కుమార్ యాదవ్ ప్రకటించారు. "స్థానిక సంస్థల ఎన్నికల్లో అగ్రకులాలను బీసీలు తరిమికొడతారనే భయంతోనే చెల్లని జీవో నెంబర్ 9 పెట్టి రాజకీయ పార్టీలన్నీ కుట్రలు చేస్తున్నాయి. ఈ కుతంత్రాలను రాజ్యాధికార పార్టీ బట్టబయలు చేస్తుంది" అని ఆయన అన్నారు. నిరసనలు, ర్యాలీలు నిర్వహించి బందుకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేవరకు పోరాడుదాం" అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు







తీన్మార్ మల్లన్న నాయకత్వంలో బీసీలు ఈ బంద్‌ను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లబోయిన అశోక్ ముదిరాజ్, టీఆర్పీ స్టేట్ సోషల్ మీడియా కో కన్వీనర్ మార్త శ్రీను, వరంగల్ జిల్లా టీఆర్పీ నాయకులు పెండల సంపత్ పటేల్, జంగిలి శ్రీనివాస్, పోలు రాజు, పల్లకొండ చందు, మాదం నరేష్ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కట్టుబడి ఉన్నాం

◆ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి

**వరంగల్ వాయిస్, శాయంపేట :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నామని, న్యాయస్థానాల నుంచి ఎలాంటి స్పందన ఉన్నా దీనిని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీ ద్రోహులుగా మిగిలిపోయాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం మండలంలోని కొప్పుల జోగంపల్లి, పెద్ద కొడెపాక, గోవిందపూర్, హుస్సేన్ పల్లి, పత్తిపాక గ్రామాలలో ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ శాస్త్రీయంగా కులగణన నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి గవర్నర్, రాష్ట్రపతికి పంపితే, దానిని బీజేపీ అడ్డుకుందని బుచ్చిరెడ్డి ఆరోపించారు. అలాగే, 2019 స్థానిక సంస్థల ఎన్నికలలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 50 శాతం మించకుండా కుదించిందని గుర్తుచేశారు. ఎన్నికల తరువాత కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాల్సిన బీఆర్ఎస్ ఆ పని ఎందుకు చేయలేదో బీసీలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చర్యల ద్వారా



బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీల వ్యతిరేక పార్టీలుగా నిరూపించుకున్నాయని అన్నారు. కేంద్రంలోని బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ 'ఓటు చోరీ'కి పాల్పడుతోందని, దీనిని ఆపాలని రాహుల్ గాంధీ గారు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఈ గ్రామాల్లో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మారేపల్లి రవీందర్, చిందం రవి, చిట్టి రెడ్డి రాజిరెడ్డి, డిటి రెడ్డి, సామల మధుసూదన్, నిమ్మల రమేష్, వైనాల కుమారస్వామి, హైదర్, కుమారస్వామి వెంకట్, రాజిరెడ్డి, ఏరుకొండ శంకర్, కొమ్ముల సదానందం, పైడి బిక్షపతి, భద్రయ్య, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సరైన పోషకాహారంతోనే ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మించాలనే లక్ష్యంతో 8వ రాష్ట్రీయ పోషణ మాసం (సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు) కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా, పరకాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో శాయంపేట మండల స్థాయిలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని సీడీపీఓ కే. స్వాతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి జెట్టి జయంతి మాట్లాడుతూ ప్రతి ఏటా నెల రోజుల పాటు నిర్వహించే పోషణ మాసం ముఖ్య ఉద్దేశం ప్రతి గ్రామంలో ప్రజలకు సరైన పోషణపై అవగాహన కల్పించడమే అని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీల పోషణ స్థితిని మెరుగుపరచడం ద్వారా భావి తరం పిల్లలు పోషణ లోపం లేకుండా, మెరుగైన ఆరోగ్యంతో ఉంటారని ఆమె స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ఆరోగ్య లక్ష్మి, ప్రీ-స్కూల్, పోషణ లోపంతో బాధపడే పిల్లల పోషణ స్థితిని మెరుగుపరిచే సేవలను లబ్ధిదారులు తప్పకుండా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా సామూహికంగా గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసనలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. గర్భిణీ, బాలింతల తల్లుల కుటుంబ సభ్యులు వారి పోషణ స్థితికి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేయడం ఈ కమ్యూనిటీ ఈవెంట్స్ యొక్క ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాయంపేట తహసీల్దార్ ప్రవీణ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఫణిచంద్ర, మెడికల్ ఆఫీసర్ సాయికృష్ణ, ఎంఎల్ హెచ్‌పీ విద్య, శోభ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు సునీత, పుణ్యవతి, పోషణ అభియాన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సుమలత, డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ కళ్యాణి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ భిక్షపతి, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే ఖబర్దార్

• దూడల సిద్దయ్య గౌడ్ ఆగ్రహం

**వరంగల్ వాయిస్, జనగామ :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతామని జనగామ జిల్లా బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా హెచ్చరించింది. జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాయ మల్లేష్ కురుమ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి గవర్నర్‌కు పంపారని సిద్దయ్య గౌడ్ గుర్తుచేశారు. ఆ బిల్లును గవర్నర్ ఆరు నెలలుగా తిరస్కరించనందున, ప్రభుత్వం ఆమోదించినట్లుగా భావించి స్థానిక సంస్థల ఎన్నికల్లో (జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, సర్పంచ్‌లకు) 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికల సంఘానికి పంపింది. ఈ మేరకు ఎన్నికల సంఘం సెప్టెంబర్ 29న షెడ్యూల్ కూడా విడుదల చేసింది. అయితే, ఈ రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ అగ్ర కుల సంఘాల తరుపున న్యాయస్థానంలో కేసు వేయడం జరిగిందని ఆయన తెలిపారు. దీని కారణంగా అక్టోబర్ 8 వరకు ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అక్టోబర్ 8న ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో, 9న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేస్తూ నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత, న్యాయస్థానం నాలుగు వారాలు ఎన్నికలను వాయిదా వేస్తూ స్టే ఇచ్చిందని, ఈ పరిణామానికి కారణం అగ్ర వర్ణ బీసీ వ్యతిరేకుల కుట్రేనని దూడల సిద్దయ్య గౌడ్ తీవ్ర ఆరోపణ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేస్తే



భవిష్యత్తులో బీసీలంతా ఏకమై వారికి తగిన గుణపాఠం చెప్పాల్సి ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలలోని బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించే ఏ రాజకీయ పార్టీకైనా భవిష్యత్తులో జరగబోయే ఏ ఎన్నికలలోనైనా తగిన గుణపాఠం చెబుతామని ఆయన గట్టిగా హెచ్చరించారు. హైకోర్టులో పిటిషన్లు వేసి బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఆర్.టీ.ఏ మెంబర్ చిలువేరు అభి గౌడ్, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చింతకింది మల్లేష్, జనగామ జిల్లా బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎదునూరి రవీందర్, కదారి ప్రవీణ్, గుజ్జుల మధు, సలేంద్రి శ్రీనివాస్ యాదవ్, గుండెటి రామచందర్ గౌడ్, బండ ప్రభాకర్, మాటే మల్లేశం, కురాకుల నాగరాజు, పులిగిల్ల శివ, బత్తిని అశోక్ గౌడ్, సింగరి ప్రశాంత్ యాదవ్, సంబరాజు ఆనందం, దేవునిపల్లి నారాయణ, కొలుపుల మధు, దడిగే గట్టయ్య, నామాల భిక్షపతి గౌడ్, కూకట్ల బాలయ్య, దుబ్బాక రాజు, కొంపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మత ప్రచారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

## బీజేపీ నేత కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మండల కేంద్రంలోని పుస్కోస్ ప్రైవేట్ పాఠశాలపై మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో మత ప్రచారాన్ని నిర్వహిస్తూ, విద్యార్థులపై ఇతర మత పుస్తకాలను బలవంతంగా రుద్దుతున్నారని ఆయన ఆరోపించారు. చర్చిలలో పనిచేసే మత ప్రచారకులైన ఫాదర్స్‌తో విద్యార్థులకు ఆ విషయాలను నేర్పించేందుకు ప్రయత్నిస్తున్న పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకొని, ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని మహేందర్ రెడ్డి ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో, ఉన్నతాధికారులకు తెలియజేసి, ఆ పాఠశాలపై చర్యలు తీసుకునే విధంగా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# తోట సుధాకర్‌కు పలువురి పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రజాపక్షం ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఇంచార్జ్ తోట సుధాకర్ మాతృమూర్తి తోట వెంకటమ్మ ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు సుధాకర్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నడికూడ మండలం చౌట్‌పర్తిలోని సుధాకర్ నివాసానికి చేరుకున్న ప్రముఖులు, ముందుగా తోట వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుధాకర్ కుటుంబాన్ని ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఎన్. రాజమౌళి, వరంగల్ జిల్లా నాయకులు పనాస ప్రసాద్, ల్యాదెళ్ల శరత్, సీనియర్ జర్నలిస్టులు ఎస్.శోభన్ బాబు, వెంకట్, మారుతి, ముత్యాల రఘు, కనకరాజు, పి.కిషోర్ కుమార్, టి. రజినీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్ల రవి తదితరులు ఉన్నారు.

# కేయూ డిగ్రీ ఫీజుల భారం తగ్గించాలి

## ఏబీవీపీ నేతల డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మొదటి సెమిస్టర్ విద్యార్థులపై ఫీజుల భారం మోపడాన్ని వెంటనే తగ్గించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డిమాండ్ చేసింది. హనుమకొండలోని బాలసముద్రంలో గల సామ జగన్ మోహన్ స్మారక భవన్‌లో ఏబీవీపీ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరేపల్లి సుజిత్ పాల్గొని మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం యూనివర్సిటీ ఫీజు, పరీక్షా ఫీజులు గత సంవత్సరం కంటే మూడింతలుగా పెంచడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. గత సంవత్సరం రిజిస్ట్రేషన్ ఫీజు సుమారు రూ.1,200 ఉండగా, ఈ సంవత్సరం దానిని రూ.2,000 నుంచి రూ.3,000 వరకు పెంచారని సుజిత్ పేర్కొన్నారు. ఈ అధిక భారం కారణంగా విద్యార్థులు చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో వరంగల్ మహానగర కార్యదర్శి బెల్లం కార్తీక్, జోనల్ ఇంచార్జ్ శ్రీశాంత్, అభిలాష్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయానికి దేవతామూర్తుల విగ్రహాలు

## కార్తీక మాసంలో ప్రతిష్ఠాపన మహోత్సవం




**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో కార్తీక మాసంలో నిర్వహించనున్న ప్రతిష్టాపన మహోత్సవం కోసం దేవతామూర్తుల విగ్రహాలను శుక్రవారం ఆలయంలోకి చేర్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ ప్రతిష్టాపన చేయనున్న గణపతి, శివలింగం, నవగ్రహాలు, అష్ట బలిపీఠం విగ్రహాలను ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా, ప్రతిష్టాపన చేయబోయే శివలింగాన్ని ఎంతో ప్రసిద్ధిగాంచిన కాశీ క్షేత్రం నందు నర్మదా నదిలో తయారైన లింగంగా పేర్కొన్నారు. ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఎంతో వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారి శంకర్, మూల శ్రీనివాస్ గౌడ్, బటిక స్వామి, మాదాసు అర్జున్, పాండవుల భద్రయ్య, దైవాల భద్రయ్య, బూర రాజగోపాల్, ఉయ్యాల భిక్షపతి, రామస్వామి, గోరంట్ల రాజయ్య, మోటపోతుల రాజన్న గౌడ్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# ఆర్టీఐతో సుపరిపాలనకు మార్గం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా ప్రజలకు సుపరిపాలన అందనుందని జిల్లా మాధ్యమిక విద్యాధికారి (డీఐఈఓ) డా. శ్రీధర్ సుమన్ అన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, వరంగల్ జిల్లాలోని పలు జూనియర్ కళాశాలల్లో సమాచార హక్కు చట్టంపై నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలను ఆయన శుక్రవారం స్థానిక ఏవీవీ జూనియర్ కళాశాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అవగాహన, చైతన్య కార్యక్రమం నిర్వహించారు. "ఆర్టీఐ ద్వారా సుపరిపాలన" అనే అంశంపై జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో సమాచార హక్కు చట్టం-2005పై వ్యాసరచన తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ డా. శ్రీధర్ సుమన్ తెలిపారు. ప్రభుత్వ పరంగా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, నిధుల కేటాయింపు తదితర అన్ని వివరాలు ఆర్టీఐ ద్వారా పొందవచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భుజేందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస రావు, అధ్యాపకులు అనిత, శ్రీధర్, జి శ్రీనివాస్, ఎస్ సంజీవ, బి గోపి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ షంషోద్దీన్ తండ్రి కన్నుమూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ షంషోద్దీన్ తండ్రి మహమ్మద్ సర్వర్ శుక్రవారం తుది శ్వాస విడిచారు. గత పది రోజులుగా ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ ఆయన కన్నుమూయడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వయస్సు రీత్యా వచ్చిన అనారోగ్య సమస్యల కారణంగా మహమ్మద్ సర్వర్ ఇటీవల ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన పరిస్థితి విషమించడంతో శుక్రవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మహమ్మద్ సర్వర్ మరణ వార్త తెలుసుకున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, జర్నలిస్టు యూనియన్ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను యువజన కాంగ్రెస్ నాయకులు తీసుకోవాలని ములుగు నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి సూచించారు. మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య ఆదేశాల మేరకు శుక్రవారం వెంకటాపూర్ మండలంలోని అందుగుల మేది గ్రామంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టెకోల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మారం సుమన్ రెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో యువజన కాంగ్రెస్ నాయకుల పాత్ర చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ముఖ్యంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పాత్ర పోషించాలని కోరారు. యువజన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంటే, దానిని ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని సుమన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ప్రజలకు అర్థం కావాలంటే, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన ఉద్ఘాటించారు. అనంతరం, సుమన్ రెడ్డి యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అలాగే, గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి సీతక్క సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు కట్టెకొల్ల వెంకటేష్ తో పాటు యూత్ నాయకులు మేకల రాజేష్, బత్తుల గణేష్, పల్లగొండ శ్యామ్, పనికల రాజు, వెంకటస్వామి, బీరెల్లి రవితేజ, బండ నితిన్, రాకేష్, శ్రీను, రాజు, లక్ష్మీనారాయణ, రాజేష్, వంశీ, మహేశ్ తదితర యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలో అందుబాటులోకి సబ్ హెల్త్ సెంటర్

## పనుల పురోగతిని పరిశీలించిన వొడితల ప్రణవ్



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ శుక్రవారం చెల్పూర్ పీహెచ్‌సీ పరిధిలోని సింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ హెల్త్ సెంటర్ పనుల పురోగతిపై ప్రణవ్ అధికారులను, నాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఈ సెంటర్ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, త్వరలోనే మరిన్ని నిధులు కేటాయించి హుజూరాబాద్‌లోని ఆసుపత్రులను అభివృద్ధి చేస్తామని ఆయన ప్రకటించారు. వైద్య సేవల విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, గణపురం :** జగిత్యాల వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, గణపురం మండలంలో ఆయన చేసిన సేవలను స్మరిస్తూ, పదవ తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ పోషకులుగా, అలాగే గోశాల నిర్మాణ మరియు నిర్వహణ దాతగా డాక్టర్ నవీన్ కుమార్ సుపరిచితులు. మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఈ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, బాలికల వసతి గృహం మేట్రిన్ జి.మాధవి చేతుల మీదుగా రూ.5,000 విలువైన 'ఆల్ ఇన్ వన్' మరియు 'మోడల్ పేపర్ల'ను విద్యార్థినులకు పంపిణీ చేశారు. గత 20 సంవత్సరాలుగా ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ జన్మదిన వేడుకలను విద్యార్థినుల సమక్షంలో కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఓటు చోరీపై కాంగ్రెస్ విస్తృత ప్రచారం




**వరంగల్ వాయిస్, వీణవంక :** బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి మూలమైన ఓటు హక్కును హరిస్తోందని, దీనిపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి హుజూరాబాద్ కాంగ్రెస్ ముందుంటుందని ఆ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం వీణవంక మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలకు మరింత సేవ చేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యాలయాన్ని ఉపయోగించాలని మండల నాయకులకు సూచించారు. కేంద్రం 'ఓటు చోరీ'కి పాల్పడుతున్న తీరును రాహుల్ గాంధీ వివరించారని, దీనిపై ఎన్నికల సంఘం ఆధారాలు ఇవ్వాలని కోరినట్లు ప్రణవ్ తెలిపారు. రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు ఓటు చోరీకి వ్యతిరేకంగా గ్రామ గ్రామాన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని వీణవంకలో మొదలుపెట్టి, ఐదు రోజుల్లో పూర్తి చేయాలని, ప్రజల్లో ఓటు చోరీపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉందని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ ఇచ్చామని, 42 శాతం రిజర్వేషన్లు దక్కే వరకు కృషి చేస్తామని ప్రణవ్ స్పష్టం చేశారు. వీణవంక మండలంలోని మల్లన్నపల్లి, ఘన్‌ముక్ల గ్రామాల నుంచి బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ప్రణవ్ కండువా కప్పి ఆహ్వానించారు. కష్టపడే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.

# దొంగల ముఠా అరెస్ట్



◆ ఆత్మకూరు పోలీసులను అభినందించిన ఏసీపీ

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పోలీస్ స్టేషన్ పరిధిలో చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. వారి నుంచి దొంగిలించిన సొత్తును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను పరకాల ఏసిపి సతీష్ బాబు శుక్రవారం వెల్లడించారు. నిందితులుగా హనుమకొండ గోపాల్ పూర్ కు చెందిన పాశం ప్రణీత్, ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న సిరిగొమ్ముల లేయో స్వార్జన్ రాజ్, వారి మిత్రుడు తన్నిముట్టి సాయిలను గుర్తించారు. జూన్ 4న, వీరు ముగ్గురూ కలిసి ఆత్మకూరు మండలం, గూడెంపాడు గ్రామంలోని రామాలయంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయం హుండీలోని రూ.1,000 నగదు, దేవుడి వెండి జంజరం, బంగారు గంటను అపహరించారు. ఈ దొంగిలించిన వస్తువుల మొత్తం విలువ సుమారు రూ.28,000 ఉంటుందని ఏసీపీ తెలిపారు. అలాగే, జూన్ 24న, ఈ నిందితులు దుగ్గొండి మండలం, గిర్నిబాగు వద్ద గల వైన్ షాపులో దొంగతనం చేసి రూ.12,000 నగదు, అలాగే పలు కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను దొంగిలించారు. శుక్రవారం మండలంలోని కటాక్షపురం పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, TS02FA4614 నంబర్ గల గ్లామర్ బైక్‌పై వస్తున్న ప్రణీత్, స్వార్జన్ రాజ్ లు పోలీసులను చూసి వెనక్కి తిరిగి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంటనే వెంబడించి పట్టుకున్నారు. బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితులను తమదైన శైలిలో విచారించగా, వారు తమ నేరాలను అంగీకరించినట్లు ఏసీపీ సతీష్ బాబు తెలిపారు. అయితే, మరో నిందితుడైన తన్నిముట్టి సాయి పరారీలో ఉన్నట్లు ఆయన చెప్పారు. దొంగతనాలు చేస్తున్న నిందితులను పట్టుకోవడంలోనూ, కేసు విచారణలోనూ ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామిని, కానిస్టేబుల్ కే. శ్రీనివాస్‌లను ఏసీపీ సతీష్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో సీఐ ఆర్. సంతోష్, ఎస్ఐలు తిరుపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాశి అమేజ్ పత్తి విత్తనం మెగా ఫీల్డ్ డే విజయవంతం



**వరంగల్ వాయిస్, దామెర :** వరిలో తొలి దశ కాపులోనే అద్భుతమైన ఫలితాలను ఇచ్చే రాశి అమేజ్ పత్తి విత్తనంపై రాశి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వరంగల్ జిల్లా, దామెర మండలం, దామెర గ్రామంలో మెగా క్షేత్ర ప్రదర్శన (ఫీల్డ్ డే) నిర్వహించింది. రైతు ఇ. నాగేశ్వర్ రావు పత్తి చేనులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డివిజనల్ బిజినెస్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, రీజినల్ బిజినెస్ మేనేజర్ ప్రదీప్ కుమార్, మరియు టెర్రిటరీ సేల్స్ మేనేజర్ రాజిరెడ్డి మాట్లాడుతూ రాశి అమేజ్ హైబ్రిడ్ పత్తి రకం ప్రత్యేకతలను రైతులకు వివరించారు., ఇది త్వరగా కాపుకు వచ్చే రకం, ప్రతికూల వాతావరణ పరిస్థితులలో కూడా రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా తట్టుకుంటుంది. ఎక్కువ కాయలను నిలుపుకునే సామర్థ్యం కలిగి ఉండటం వల్ల రైతులకు అత్యధిక దిగుబడిని అందిస్తుంది. ఈ క్షేత్ర ప్రదర్శనలో చుట్టుపక్కల గ్రామాల నుంచి 300 మందికి పైగా పత్తి రైతులు, 50 మంది డీలర్లు పాల్గొన్నారు. కంపెనీ సిబ్బంది నాగరాజు, మధు, రాము, సంతోష్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డీఎస్సీ 2024 టీచర్ల వార్షికోత్సవ సంబరాలు



**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** డీఎస్సీ 2024 ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికై, సర్వీస్‌లో చేరి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా నల్లబెల్లి మండలానికి చెందిన కొత్త ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల పని వేళలు ముగిసిన అనంతరం వీరు సమావేశమయ్యారు. లక్షల మంది అభ్యర్థులతో పోటీపడి, అత్యంత ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించిన ఈ ఉపాధ్యాయులు... గత సంవత్సర కాలంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యాబోధనలో తమదైన పాత్ర పోషించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట, ఎఫ్.ఎల్.ఎన్ వంటి విద్యా అభివృద్ధి కార్యక్రమాలలో వీరు సీనియర్ ఉపాధ్యాయులతో కలిసి చురుకైన పాత్ర పోషించిన తీరును ఒకరికొకరు అభిప్రాయాలుగా పంచుకున్నారు. అధికారులు, సీనియర్ల సూచనలు పాటిస్తూ విద్యాబోధనలో తాము కృషి చేస్తున్న విధానాన్ని వివరించుకున్నారు. ఈ సందర్భంగా, నూతన ఉపాధ్యాయులు భవిష్యత్తు లక్ష్యాల పట్ల ప్రతిజ్ఞ చేశారు. పాఠశాలల అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. ఈ సంబరాల కార్యక్రమానికి పీ.ఆర్.టీ.యూ.టీ.ఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్, పీ.ఆర్.టీ.యూ. మండల అధ్యక్షుడు ఉడత రాజేందర్, ప్రధాన కార్యదర్శి బానోతు కృష్ణ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల బాధ్యులు శేఖర్, గిరిధర్, శ్రీనివాస రాజు, సీనియర్ ఉపాధ్యాయులు రామ్మూర్తి, శ్రీదేవి, కళావతి, కూనమల్ల రాజన్ బాబు, మరియు డీఎస్సీ-2024 ఉపాధ్యాయులు (టి.అనూష, కె.అనిత, ఎం.అనూష, యు.అనిత, మనోజ, భాగ్యశ్రీ, రజిత, శోభా, శ్రీలత, విజేత, ప్రవీణ్ పాల్గొన్నారు.

# మిస్సింగ్ మొబైల్ ఫోన్లు రికవరీ

◆ సీఈఐఆర్ పోర్టల్ తో బాధితులకు అందజేత



**వరంగల్ వాయిస్, మట్టెవాడ క్రైం :** వరంగల్ పోలీసులు తమ సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో మరో విజయాన్ని సాధించారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్ మెంట్ ఐడెంటీటీ రిజిస్టర్) పోర్టల్‌ను సమర్థవంతంగా ఉపయోగించి, రూ. 6,80,000 విలువైన 32 మిస్సింగ్ మొబైల్ ఫోన్లను విజయవంతంగా ట్రేస్ చేసి రికవరీ చేశారు. ఈ రికవరీ కార్యక్రమం వరంగల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ శుభం నాగరాలే, ఎన్.కరుణాకర్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మట్వాడ పోలీస్ స్టేషన్ల చురుకైన పర్యవేక్షణలో జరిగింది. మట్వాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ మచర్ల సుమన్ (పీసీ1227) సీఈఐఆర్ సిస్టమ్‌ను అద్భుతంగా ఉపయోగించి ఈ మొబైల్ ఫోన్లను గుర్తించి ట్రేస్ చేయడంలో కీలకపాత్ర వహించారు. రికవరీ చేసిన ఈ మొబైల్ ఫోన్లను శుక్రవారం సరైన ధృవీకరణ ప్రక్రియ అనంతరం వారి యజమానులకు తిరిగి అప్పగించడం జరుగుతుంది.గమనించదగ్గ విషయం ఏమిటంటే, వరంగల్ పోలీసులు ఇంతకుముందు కూడా 200కు పైగా మిస్సింగ్ మొబైల్ ఫోన్లను ఇదే సాంకేతిక ఆధారిత పద్ధతిలో ట్రేస్ చేసి యజమానులకు అందజేశారు. ఈ విజయం వరంగల్ పోలీసుల ప్రజాసేవా దృక్పథం, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ప్రజల ఆస్తి పరిరక్షణ పట్ల ఉన్న అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. మొబైల్ ఫోన్ పోయినప్పుడు లేదా దొంగిలించబడినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను వరంగల్ పోలీసులు ప్రజలకు తెలియజేశారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు, అలాగే సీఈఐఆర్ పోర్టల్ (https://ceir.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో కంప్లయింట్ నమోదు చేయవచ్చు. ఈ పోర్టల్ ద్వారా పోయిన మొబైల్‌ను బ్లాక్ చేయడం, దుర్వినియోగాన్ని అరికట్టడం, పోలీసుల సమన్వయ కృషి ద్వారా తిరిగి పొందడం సాధ్యమవుతుంది. మీ మొబైల్ ఐఎంఈఐ నంబర్‌ను నమోదు చేసుకొని భద్రంగా ఉంచుకోండి. యజమాన్యం, ఐఎంఈఐ వివరాలు నిర్ధారించకుండా సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయవద్దని సూచించారు.

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవద్దు



**వరంగల్ వాయిస్, సుబేదారి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించదలిచిన 42 శాతం రిజర్వేషన్ల ప్రయత్నాలను ఎవరూ అడ్డుకోవద్దని కాకతీయ యూనివర్సిటీ బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గడ్డం కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో, జీవో నెంబర్ 9పై తెలంగాణ హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ కృష్ణయ్య మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లను అడ్డుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టడానికి బీసీలంతా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. 2013, 2019, 2025లలో కూడా ఒకే వర్గానికి చెందినవారు చట్టాల్లోని లోపాలను అడ్డం పెట్టుకుని బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తూ బీసీలకు అన్యాయం చేస్తున్నారని డాక్టర్ కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ తండు నాగయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించి, రిజర్వేషన్ల సాధనకు సహాయ పడాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బిల్లు పెట్టినా, సవరణ బిల్లు పెట్టినా, జీవో జారీ చేసినా రిజర్వేషన్లు సాధించలేకపోయింది. కాబట్టి, ప్రభుత్వం పార్లమెంటరీ ప్రక్రియ ద్వారానే రిజర్వేషన్లు సాధించే ప్రయత్నాలు చేయాలని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యక్షులు డాక్టర్ బ్రహ్మయ్య బీసీ టీచర్స్ అసోసియేషన్కు చెందిన డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ సుధీర్, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ సతీష్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ చింతం ప్రవీణ్, డాక్టర్ రాజు, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ సునీత, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ జోత్స్న, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ గిరి, డాక్టర్ కిరణ్, డాక్టర్ కవిత, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ కుమార్, డాక్టర్ రమేష్, డాక్టర్ సదానందం, డాక్టర్ జేపీ, డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ పార్టీ శాయంపేట మండలంలో 'కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేసింది. భూపాలపల్లి మాజీ శాసనసభ్యుడు గండ్ర వెంకటరమణా రెడ్డి, వరంగల్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ఈ ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు పంపిణీ చేసిన 'బాకీ కార్డుల'లో కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల పాలనలో వివిధ వర్గాలకు బాకీ పడిన హామీల వివరాలను వివరించారు. ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేసిందని ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు.

# నూతన ఏఈ కార్యాలయం ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సహాయ ఇంజనీర్ (ఏఈ) కార్యాలయం శుక్రవారం ప్రారంభం కానుంది. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఏఈ గుర్రం రమేష్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ రూరల్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) బి.సౌమ్య నాయక్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) దేవేందర్ హాజరై కార్యాలయాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ఇంజనీర్ చందనతో పాటు విద్యుత్ సిబ్బంది కూడా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్ వైఖరి బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉంది

## బీజేపీ నేత డా. వన్నాల వెంకటరమణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ తీవ్రంగా ఖండించారు. ఈ మొత్తం వ్యవహారం "అందరి ముందు నిన్ను కొట్టినట్టు నటిస్తా, నువ్వు ఏడ్చినట్టు నటించు" అన్నట్లుగా ఉందని ఆయన విమర్శించారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇస్తుందన్న విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు ముందే తెలుసు. కావాలనే జీవో ఇచ్చి, ప్రజలతో నాటకాలు ఆడుతూ, ఎన్నికల పేరుతో కాలయాపన చేసి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే బీసీల్లో సామాజిక, రాజకీయ చైతన్యం పెరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే బీసీ సమాజానికి క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించి, న్యాయపరమైన లోపాలను సరిచేసుకొని, స్థానిక ఎన్నికలు సజావుగా జరిగేలా చూసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి. బీసీలంతా కలిసికట్టుగా ఈ ప్రభుత్వంపై పోరాడి, తమ రిజర్వేషన్లను సాధించుకోవాలని డాక్టర్ వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు.

# పద్మశాలి యువసేన అధ్యక్షుడిగా వనం దేవరాజ్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల పద్మశాలి యువసేన అధ్యక్షుడిగా వనం దేవరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో జరిగిన 18వ వార్షికోత్సవ సమావేశంలో నూతన యువసేన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశం ప్రారంభంలో వార్షికోత్సవ లెక్కలను పరిశీలించి, సభ్యులందరూ ఆమోదించారు. అనంతరం ఏకగ్రీవంగా నూతన అధ్యక్షుడిగా వనం దేవరాజ్, ఉపాధ్యక్షుడిగా భాషని బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మంత్రి రమేష్ బాబు, కోశాధికారిగా సామల క్రాంతి కుమార్, సహాయ కార్యదర్శిగా కోమటి రాజశేఖర్, డైరెక్టర్లుగా గొట్టిముక్కుల రాజు, భాషని రాజు, సాంబయ్య, ములుకుంట్ల సదానందం, కడారి చంద్రమౌళి ఎన్నికయ్యారు.

# కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఓ నాటకం

## బీజేపీ నాయకుడు లాడే శివ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలో భారతీయ జనతా పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఉత్సాహభరితమైన ఆదరణను తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి 'ఓటు చోరీ' అనే కొత్త నాటకానికి తెరలేపారని బీజేపీ జిల్లా నాయకుడు లాడే శివ ఘాటుగా విమర్శించారు. గత వారం రోజులుగా తాను చేపట్టిన ప్రజా సంపర్క యాత్రలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో, కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోందని లాడే శివ అన్నారు. "ప్రజల మద్దతు పొందుతున్న బీజేపీకి భయపడి కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఓటు చోరీ అంటూ నాటకాలు వేయడం, తప్పుడు ఆరోపణలు చేయడం అర్థరహితం" అని లాడే శివ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికలను ప్రస్తావించారు. "అక్కడ ఓటింగ్ జరిగి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గెలిచారంటే, ఓటు చోరీ ఎక్కడ జరిగింది? అప్పుడెందుకు ఈ ఆరోపణలు చేయలేదు?" అంటూ బుచ్చిరెడ్డిని నిలదీశారు. "బీజేపీ నైతికతతో, ప్రజల విశ్వాసంతో ముందుకెళ్తుంది. బూటకపు ఆరోపణలు మాకు అడ్డుకావు. ప్రజలు నిజాన్ని గుర్తించగలిగే శక్తి కలవారు" అని లాడే శివ ధీమా వ్యక్తం చేశారు.

# రెడ్డి జాగృతి నాయకుల ఇళ్ల ముట్టడికి బీసీల యత్నం

## ◆ అరెస్టు చేసిన పోలీసులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 9 (2018) ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ, తెలంగాణ బీసీ మహాసేన, ఆలిండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో చలో మహబూబ్‌నగర్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. రిజర్వేషన్లపై హైకోర్టును ఆశ్రయించిన రెడ్డి జాగృతి నాయకులు మాధవరెడ్డి, గోపాల్ రెడ్డిల ఇళ్ల ముట్టడికి బీసీ నాయకులు వరంగల్ నుంచి బయలుదేరారు. కాకతీయ యూనివర్సిటీలోని జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళులు అర్పించిన అనంతరం, నాయకులు ముట్టడికి ముందుకు సాగారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. బీసీ నాయకులు ఈ సందర్భంగా ప్రధాన పార్టీలపై, అగ్రవర్ణ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జీవో నెంబర్ 9 బీసీలకు అనుకూలంగా ఉన్నప్పటికీ, అది రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు కాదని అందరికీ తెలుసు. అగ్రవర్ణ నాయకులు, ప్రధాన పార్టీలు కావాలనే దొడ్డిదారిన కేసులు వేయించి, బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. "ఇప్పటికైనా హైకోర్టులో పిటిషన్ వేసిన రెడ్డి జాగృతి నాయకులు దానిని ఉపసంహరించుకోవాలి. మా హక్కులను కాలరాస్తే భవిష్యత్తులో మీ అగ్రవర్ణ నాయకులకు పుట్టగతులు ఉండవు" అని బీసీ నాయకులు హెచ్చరించారు. పోలీసులు అరెస్టు చేసినప్పటికీ, "అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు. బీసీలకు రావాల్సిన వాటాను సాధించేవరకు ఈ పోరాటం ఆగదు" అని నాయకులు పునరుద్ఘాటించారు. "ఖబర్దార్... బీసీ వ్యతిరేకుల్లారా! ఖబర్దార్... రెడ్డి జాగృతి అహంకార నాయకులారా!" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ బీసీ మహాసేన కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్, కో కన్వీనర్ గొల్లపల్లి వీరస్వామి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కందికొండ వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలు తగ్గించాలి

## రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచి సామాన్య, పేద ప్రజలపై భారం మోపడం సరికాదని, వెంటనే పెంచిన బస్ చార్జీలను తగ్గించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు బస్సు చార్జీలు పెంచమని, ప్రజలపై భారాలు వేయమని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం... 20 నెలల్లో మూడుసార్లు చార్జీలు పెంచి, వివిధ రూపాలలో కోట్లాది రూపాయల భారాలను మోపిందని వెంకట్రాములు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, మరోవైపు బస్ చార్జీలు, విద్యార్థుల బస్ పాస్‌ల రేట్లు పెంచడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. ఆర్టీసీ లాభాలలో ఉందని ఒకవైపు ప్రకటిస్తూనే, మరోవైపు చార్జీలు పెంచడం ఏంటని ప్రశ్నించారు. సంక్షేమ పాలన అంటే ప్రజలపై భారాలు మోపడమేనా? అని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే అంతులేకుండా పెరిగాయని, ఇలాంటి పరిస్థితుల్లో బస్ చార్జీలు పెంచడం "మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంబుగా" తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేనిచో ప్రజల విశ్వాసాన్ని కోల్పోవాల్సి వస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజలపై పెను భారాలను మోపుతున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ 'బాకీ కార్డుల' పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, ఆ మోసపూరిత హామీలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికి 'బాకీ కార్డులు' పంపిణీ చేయాలని నడికూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దురిశెట్టి చంద్రమౌళి (చందు) పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసగించిందని, వారికి ఇవ్వాల్సిన మొత్తాన్ని 'బాకీ కార్డుల' రూపంలో అందిస్తున్నామని చంద్రమౌళి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త తమను తాము అభ్యర్థులుగా భావించి పనిచేయాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతి రెడ్డి, వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యం వైపు ప్రయాణించాలి

## ◆ జిల్లా వైద్యాధికారి డా. అప్పయ్య



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** విద్యార్థులు అనవసర మానసిక ఒత్తిడికి గురికాకుండా, స్పష్టంగా ఎంచుకున్న లక్ష్యం వైపు ప్రయాణించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరిసా పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, రుగ్మతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టడంతో పాటు, మానసిక ఉల్లాసానికి అవసరమైన ఆటలు, పాటలు వంటి కార్యకలాపాలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. "ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, ఆ లక్ష్య సాధన దిశగా పట్టుదలతో కృషి చేయాలి. మానసిక ఆరోగ్య సమస్యలు ఎదురైతే వాటిని ఇతరులకు చెప్పుకోవడానికి ఏమాత్రం వెనకాడకూడదు" అని ఆయన విద్యార్థులకు ధైర్యం చెప్పారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కూచనపల్లి ప్రహసిత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు సమస్యల పట్ల 'ఓపెన్ మైండ్ సెట్' కలిగి ఉండాలని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసే నిద్రలేమి, చదువు పట్ల టెన్షన్, ఆహారపు విధానాలలో మార్పులు, నిరంతరం విచారం (డిప్రెషన్ )లను అధిగమించేందుకు పిల్లలు ఎక్కువగా ఒంటరిగా చదవకుండా, గ్రూప్ డిస్కషన్ (సామూహిక చర్చ) చేసుకుంటూ చదవాలన్నారు. పరీక్షలు అనగానే భయపడకుండా, ఒక ప్రణాళిక ప్రకారంగా ప్రిపేర్ అవ్వాలి. పాస్ అవుతామా, ఫెయిల్ అవుతామా అనే భయం లేకుండా పట్టుదలతో చదవాలి. ఒత్తిడికి లోనుకాకుండా, ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరికైనా భయం, ఆందోళన లేదా ఆత్మహత్య ఆలోచన అనిపిస్తే, వెంటనే 14416 టెలి మానస్కు కాల్ చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇక్తాధర్ అహ్మద్, ఆత్మకూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్పందన, పాఠశాల హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ జాయిస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జునేడి, హెల్త్ సూపర్వైజర్లు కె. సంపత్, శ్రీనివాస్, సోషల్ వర్కర్ నరేష్, ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు మరియు విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.



# ఘనంగా కేశవమూర్తి జన్మదిన వేడుకలు

వర్ధమాన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవ మూర్తి 59వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయనను మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, తాటికొండ రాజయ్య శాలువాతో సత్కరించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేశవ మూర్తిని సీనియర్ జర్నలిస్టులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ కు చెందిన సీనియర్ జర్నలిస్టులు బీఆర్ లెనిన్, వేముల నాగరాజు, గడ్డం రాజిరెడ్డి, మస్కపురి సుధాకర్, పి.వేణుమాధవ్, వల్లాల వెంకటరమణ, తుమ్మ శ్రీధర్ రెడ్డి, బొక్క దయాసాగర్, కక్కెర్ల అనిల్, పీవీ మదన్ మోహన్, కేకే, పెద్దిష్, అరుణ్ కుమార్, కృష్ణమోహన్, గొల్లపెల్లి వెంకటరత్నం, వంకే శ్రీనివాస్, తాళ్ల పెల్లి వేణు, వి.తిరుపతి, ప్రశాంత్, మెందు రవీందర్, బండి పర్వతాలు, కాయల పూర్ణచందర్, గోకార పు శ్యామ్, దేవుని రాధాకృష్ణ, బాదావత్ బాలాజీ, సురాసి రమేష్, రాజిరెడ్డి, రాజు తదితరులు కేశవమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ప్రముఖ కాంట్రాక్టర్ ఎంఎం మూర్తి, రాష్ట్ర మినిమం వేజెస్ బోర్డ్ అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ బాసాని చంద్రప్రకాష్, ఈగ మల్లేశం, వేముల రాజేశ్వరరావు, గుజ్జ వెంకటేశం, దుబాసి నవీన్, రాజు, నాగరాజు, అనిల్ బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు మాలోతు నాను నాయక్ తదితరులు కేశవమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

వరంగల్ వాయిస్ స్టాఫ్, ఆత్మీయులు సామల సూర్యప్రకాశ్, వెన్ను రాము, గోలి రవి, సిద్దోజు రాకేష్, ఉస్నగిరి శ్రీకాంత్, బొజ్జం చొక్కారావు, తాటికొండ వీరస్వామి, జంపాల మధుసూదన్, మైదంశెట్టి సాంబయ్య, పూజారి విజయ్ కుమార్, పూజారి శ్రీనివాస్ తదితరులు గడ్డం కేశవమూర్తికి జన్నదిన శుభాకాంక్షలు తెలిపారు.





## గడ్డం కు ఘన సన్మానం"

సీనియర్ జర్నలిస్ట్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి 59వ జన్మదిన వేడుకలు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజు సందర్భంగా గడ్డం కేశవమూర్తితో కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించారు. తిరుమల శ్రీ వేంకటేహస్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ జన్మదిన వేడుకల్లో కార్యదర్శి బొల్లారం సదయ్య, ఉపాధ్యక్షులు యంసాని శ్రీనివాస్, కే.దుర్గాప్రసాదరావు, వలిశెట్టి సుధాకర్, డెస్క్ జర్నలిస్టులు సీహెచ్.సోమనర్సయ్య, రఘుపతి, ఓంకార్, జర్నలిస్టులు కట్ట రాజు, ధనుంజయ, నాగరాజు, షేన్, సోని, రాకేష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అభినందించిన**
**మాజీ మంత్రి**
**ఎర్రబెల్లి దయాకర్ రావు**

**శుభాకాంక్షలు**
**తెలిపిన ప్రెస్ క్లబ్ బాధ్యలు,**
**ఇతర జర్నలిస్టులు,**
**సన్నిహితులు**



## గడ్డం వారికి అక్షర సుమాంజలులు..

మోముపై మీచిరునవ్వు...
సెలయేరు పయనంలా
మీ మాటల ఒరవడి...
అద్భుతమైన మీ ఆలోచనలతో సమస్య పరిష్కార
చతురత...
అందరిని ఆదుకునే మీ కలిమి..
ఎదుటివారి హృదలలో ధైర్యాన్ని నింపే
మీ మూర్తిమత్వం...
వంశోద్ధారాకుడిగా తాత పేరును తనపేరుగా స్వీకరించి...
గట్లకానిపర్తి అంటే గడ్డం వారికి ప్రత్యేక గౌరవాన్ని
నాటినుంచి నేటి దాకా కొనసాగిస్తూ..
తాతకు తగ్గ మనవాడిలా.. ఉంటూ..
ఊరిలో స్నేహితులకు ఒక బ్రాండ్ గా
యుక్త వయసులో రాజకీయ రంగంలో మండల
స్థాయిలో చెరగనిముద్ర వేసుకొని అలసత్వానికి లోనై..
ప్రజాసమస్యను ప్రశ్నించే గొంతు కావాలని
నాడే మనసులో బీజం వేసుకొని
నేడు వరంగల్ వాయిస్ గా ప్రజా సమస్యలపై
ధ్వజమేత్తుతున్న దిగ్విజయశాలి...
అంతే కాదు సాహితీ వనంలో సువాసనలు వేదజల్లే
కుసుమం
అన్నో అక్షరాలకు నక్షవేసి
మనసులో మెదిలిన ఆలోచనలను తక్షణమే
లక్షణంగా అక్షరరూపం దాల్చిన అక్షర
సేధ్యుడు..
ఈయన కలం నుంచి జలవారిన
అక్షరాలు అన్నో పుస్తకరూపం
దాల్చాయి..
అవి జనసారాదులుగా
నడిపిస్తున్నాయి...
అంతర్మదనాలుగా ఆలోచింప
చేస్తున్నాయి..
అక్షరాలుగా తెలంగాణ ఆత్మఘోష
వినిపిస్తున్నాయి...
ఇంతటి మహనీయుడు
అక్షరాలను ఆయుధంగా నమ్ముకొని
వరంగల్ వాయిస్ గా నిలిచిన మన
గడ్డం కేశవ మూర్తి గారికి
అక్షరమే సాక్షాత్కారంగా నిలిచి
పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి
భావ ప్రకటన తెలుపుతుందంటే
మహాదశ్చర్యంగా ఉంది.







## షటిల్ క్రీడాకారుల సన్మానం..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో షటిల్ క్రీడాకారుడు గడ్డం కేశవ మూర్తిని ఘనంగా సన్మానించారు. కేశవమూర్తి 59వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పీసీసీ ప్రధాన కార్యదర్శి బోద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. కన్నుల పండుగగా జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో వైవి.రాజేందర్, మార్త శ్రీధర్, శివ, సంతోష్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్, దేవేందర్, రోహన్, తోట శ్రీనివాస్, శరత్, పి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొని కేశవమూర్తిని శాలువాతో సత్కరించారు.



# అంతా డ్రామా..

**420 హామీల్లాగే**
**42 శాతం రిజర్వేషన్లు**
**మాజీ మంత్రి**
**ఎర్రబెల్లి దయాకర్ రావు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ 420 హామీల్లాగే 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఒక డ్రామా అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్ లోని ఎర్రబెల్లి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ లిల్లీపుట్ ముఖ్యమంత్రికి పాలన తెలియదని, అసలు అవగాహన లేదని, మంత్రులు కూడా అట్లానే ఉన్నారని ఎద్దేవా చేశారు. కోర్టును గౌరవించకుండా పొద్దుగాల నామినేషన్లు తీసుకొని సాయంత్రం నవ్వుల పాలయ్యే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. ఈ ప్రభుత్వానిదని, పొద్దుగాల లేస్తే కేసీఆర్‌ను తిట్టుడు, దేవుళ్ల మీద ఒట్టు పెట్టుడు తప్ప ఈ ముఖ్యమంత్రికి ఏం తెలియదన్నారు. ఆయన మాటలు గతంలో ప్రజలు నమ్మారు కాని కోర్టులు నమ్మలేదు కాబట్టే హైకోర్టు గూబ గూయ్యిమనిపించిందన్నారు. రాష్ట్రంలో కనీసం ఇద్దరు మంత్రులు కలిసి తిరిగే పరిస్థితి లేదని, ఎవరి కుర్చీ ఎవరు లాక్కుంటారనే భయంతో ఉన్నారని, ఏ ఒక్క మంత్రి కూడా నియోజకవర్గంలో తిరగడం లేదన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక కొత్త డ్రామాకి తెరలేపి, స్థానిక ఎన్నికలు నిర్వహించలేకనే ఏదో కోర్టు ఆపిందని, తాము బీసీల కోసం అన్ని చేశాం అని చెప్పుకోవాలని కాంగ్రెస్ కుట్ర పన్నిందన్నారు. 55 ఏండ్లు కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉండి బీసీల గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. తూతూ మంత్రంగా జీవో ఇచ్చి ఎన్నికలు నిర్వహించలేకనే ఇదంతా డ్రామా అని, నిజంగా బీసీల పట్ల ప్రేమ ఉంటే రిజర్వేషన్లపై కేంద్రంతో కొట్లాడాలని సూచించారు. దానికి మేమంతా కలిసి వస్తామన్నారు. ఈ ప్రభుత్వం 22 నెలలు అయిందని, అధికారంలోకి వచ్చి బీసీలకి ఏం చేశారని, బీసీ బంధు బందు పెట్టింది, చేప పిల్లల పంపిణీ బందు పెట్టింది, నాయి బ్రాహ్మణ, రజకుల ఉచిత విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో పెట్టింది, గొల్లకురుమలకు గొర్రెలు బందు పెట్టి ఇంకా ఏదో బీసీల మీద ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని ఆరోపించారు. అసలు రాష్ట్రాలకి రిజర్వేషన్ల అధికారం ఇవ్వడం నేరం అడిగితే జైల్లో పెట్టాలన్న ఈ రేవంత్‌రెడ్డిని మరి ఇప్పుడు ఏ జైల్లో పెట్టాలన్నారు. 42 శాతం బిల్లు గవర్నర్ ఆమోదం పొందకుండా ఎన్నికలకు పోవటమే ఒక తెలివి తక్కువ పని అన్నారు. ఈ రిజర్వేషన్ ప్రక్రియ సరిగా అమలుకాకనే బిహార్ లో ఎన్నికలు ఆగిపోయాయని, మహరాష్ట్రలో ఎన్నికలు జరిగినా 18 రోజుల్లో ఎన్నికలు రద్దు అయ్యాయని, ఈ మాత్రం సోయి ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. ఈ కాంగ్రెస్ అసమర్ధ పాలనతో గ్రామాలు అన్ని వెనకబడి పోతున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయితీలకు ఒరగ బెట్టిందేమీ లేదన్నారు. ఆనాడు కేసీఆర్ గ్రామాలు బాగుపడతేనే రాష్ట్రం బాగుంటుందని గ్రామ పంచాయితీలకు అధిక నిధుల ఇచ్చి అభివృద్ధి చేస్తే..ఈ ప్రభుత్వం ఆ గ్రామాల అభివృద్ధికి అడ్డుగా నిలవడంతో గ్రామాలు ఆధ్వాన్న స్థితిలోకి వచ్చాయన్నారు. అభివృద్ధి చేతగాక ఈ ప్రభుత్వం అమ్మకాలకు తెరలేపిందని, ఆర్టీసీని సైతం ప్రైవేటికరణ చేసే కుట్ర జరుగుతోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి 13 వందల 50 కోట్లు అప్పు చేసి ఆ అప్పును బస్సు చార్జీలు పెంచి ఆ కుటుంబంలోని మగవారిపై రుద్దుతున్నారని అన్నారు. గతంలో కేసీఆర్ 2 వేల కోట్లు ఆర్టీసీ బకాయిలు చెల్లించి అప్పుల్లో ఉన్నా ఆర్టీసిని అభివృద్ధిలో నడిపిస్తే ఈ దుర్మార్గ ప్రభుత్వం ఆర్టీసీని అమ్మేయాలని కుట్ర చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వం పట్ల ప్రజలు కోపంగా ఉన్నారని, ఇంకా ఇలాంటి పిచ్చి పనులు చేసి వారి సహనాన్ని పరిక్షీస్తే ఉరికించి కొడతారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఒడిదల సతీష్ కుమార్, శంకర్ నాయక్, పాలకుర్తి నియోజకవర్గం, వర్ధన్నపేట నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వరిలో కంకి నల్లి, ఇతర తెగుళ్లు

◆ **నివారణపై రైతులకు సూచనలు**

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి గ్రామంలో శుక్రవారం వరి పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రామకృష్ణ, రైతులు సూర మహేష్, పుప్పాల రమేష్, మదన్మోహన్, రాజేందర్, లింగమూర్తి, లక్ష్మణ్, రాంబాబు, సతీష్ పాల్గొన్నారు. పంటలను పరిశీలించిన అనంతరం ఏఈఓ రామకృష్ణ మాట్లాడుతూ వరిలో ముఖ్యంగా కంకి నల్లి (నల్లకంకి) ఆశించడం వల్ల తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని రైతులకు సూచించారు. ఈ నష్టం జరగకుండా ఉండాలంటే, రైతులు వరి పొట్ట దశలో కంకి నల్లి యాజమాన్యాన్ని తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు



# కాంగ్రెస్‌ను నిద్రపోనివ్వం

☐ **ప్రతి పైసా బాకీ ఇప్పించే వరకు పోరాటం**

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చే వరకు తాము నిద్రపోబోమని, ప్రభుత్వాన్ని కూడా నిద్రపోనివ్వమని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి అన్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల్లో 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఇంటింటికి అందజేసే కార్యక్రమం జరిగింది. పెద్దాపూర్, అక్కంపేట గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంజీవరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు కాంతాల కేశవరెడ్డి, బొళ్లబోయిన రవియాదవ్, సావురే రాజేశ్వరరావు, రాయరాకుల రవీందర్, మండల యూత్ అధ్యక్షుడు బత్తిని వంశీ గౌడ్, ఆయా గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఎంఏవై పై అవగాహన కల్పించాలి

☐ **బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-అర్బన్) 2.0 కార్యక్రమంపై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఎంఏవై-అర్బన్- 2.0 అవగాహనలో భాగంగా రూపొందించిన అంగీకార్- 2025 పోస్టర్ ను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పీఎంఏవై-అర్బన్ 2.0 లో భాగంగా గతంలో నమోదు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పురోగతిని పరిశీలించాలన్నారు. పీఎంఏవై-అర్బన్ 2.0 గురించి ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు లబ్ధిదారులను గ్రూపులుగా తయారు చేయాలని, పీఎం సూర్య ఘర్ యొక్క ప్రయోజనాలను పీఎంఏవై-అర్బన్ లబ్ధిదారులకు మఫ్ట్ బిజిలీ యోజనలో భాగంగా అందించేలా చూడడంతోపాటు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఆర్బన్ 2.0 దరఖాస్తుల వేగవంతమైన ధృవీకరణతో పాటు స్పెషల్ ఫోకస్ గ్రూప్ కింద లబ్ధిదారులను చేర్చి వారికి వడ్డీ, సబ్సిడీ పథకం (ఐఎస్ఎస్) కింద గృహ రుణాలపై సబ్సిడీని సులభతరం చేయడం పై అవగాహన కల్పించాలన్నారు. అల్ప ఆదాయ గృహాలకు( క్రెడిట్ రిస్క్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్) గురించి వారికి అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ హనుమకొండ జిల్లాల హౌసింగ్ పీడీలు గణపతి, హరి కృష్ణ బల్దియా డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, రవీందర్ తో పాటు హౌసింగ్ ప్రత్యేక అధికారులు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.




# 19న నరకాసుర వధ

☐ **కార్పొరేటర్ మరుపల్ల రవి**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నరకాసుర వదను తిలకించిన తర్వాతే నోములు, దీపావళి పండుగ జరుపుకుంటే పుణ్యప్రదమని వేద బ్రాహ్మణులు తెలియచేసినందున ఈ నెల అక్టోబర్ 19 వ తారీఖున జరుగు నరకాసుర వద ఉత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించాలని 40 వ డివిజన్ కార్పొరేటర్, నరకాసుర వద ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి కోరారు. నరకాసుర వధ ఉత్సవం కరపత్రాలను శుక్రవారం ఉర్సు ప్రతాప్ నగర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్సు గుట్ట కూడా ప్రాంగణంలో 58 అడుగుల ఎత్తుతో నరకాసుర విగ్రహానికి బాంబులు అమర్చి అత్యంత వైభవోపేతంగా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరు కానున్నట్లు తెలిపారు. నరకాసుర వధ ఉత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఇట్టి కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మరుపల్ల గౌతం, ఉపాధ్యక్షులు దూడే బాల కొమురెల్లి, సహాయ కార్యదర్శి శెట్టి మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శులు అన్నకుమార స్వామి, టం టం నరసింహ, కాటం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com